ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ



కొత్తపల్లిలోని 12వ వార్డులో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వర్షం భయపెట్టినప్పటికీ.. బతుకమ్మ ఆడే సమయానికి తగ్గడంతో మహిళలు ఊపిరి పీల్చుకున్నారు. కొత్తపల్లి మండలంలోని బావుపేట, ఖాజీపూర్‌లలో 7వ రోజు బతుకమ్మ వేడుకలు జరుపుకోగా.. మల్కాపూర్, చింతకుంట, కమాన్‌పూర్, బద్దిపల్లి, నాగులమల్యాల, ఎలగందుల గ్రామాల్లో 9వ రోజు, కొత్తపల్లిలో 10వ రోజు జరుపుకోవడం అనాదిగా వస్తోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబేలా పూలనే గౌరమ్మగా పూజిస్తూ జరుపుకునే ఈ పూల పండుగ సంబరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను కూడళ్లలో పెట్టి మహిళలంతా వాటిచుట్టు తిరుగుతూ పాటలు పాడుతూ కోలాటాలాడారు. ఏడాదికోసారి జరుపుకునే ఈ వేడుకలకు మహిళలంతా కొత్త బట్టలు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో ఆనందంగా గడిపిన మహిళలు అనంతరం మళ్లీ రావమ్మా..బతుకమ్మ అంటూ చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జన అనంతరం ఒకరినొకరు పిండి వంటలను వాయినాలు ఇచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు, మహిళలు, బాపూజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెక్సికోలో..

కరీంనగర్: మెక్సికో నగరంలో రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు కుమార్, మహేశ్, భవన్, మాధవరెడ్డి, వీరా రాం, దినేష్, గోపి, లోకేశ్, జైసింహారెడ్డి, సతీశ్, వంశీ, నరేశ్. కాజ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



బతుకమ్మతో కౌన్సిలర్ వేముల కవిత



కొత్తపల్లి బాపూజీ యూత్ ఆధ్వర్యంలో..



కుర్మవాడ గోకుల్‌నగర్‌లో..



మెక్సికోలో బతుకమ్మ వేడుకల్లో ఉమ్మడి జిల్లా వాసులు



బతుకమ్మతో మహిళ



కొత్తపల్లిలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలో మహిళలతో మున్సిపల్ చైర్మన్ రాజు



కొత్తపల్లిలోని తూర్పువాడలో..



బతుకమ్మతో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు మమత దంపతులు

ఉద్యోగుల సంక్షేమమే మా పంతం



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో టీఎన్జీవో నాయకులు జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డిలు శుక్రవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులందరూ అసంతృప్తిగా ఉన్నారని, పెండింగ్ డీఏ, బిల్లులు, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ గురించి ప్రస్తావించగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీంపై సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరీతో ఫోన్ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకువెళ్లి ఎంప్లాయీస్ హెల్త్ స్కీం సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తానన్నారు. ఉద్యోగులకు అండగా ఉండి కంటికి రెప్పలా కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని అన్నారు. టీజీవో నేత మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, ఒంటెల రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్ సింగ్, పోలు కిషన్, రాజేశ్వరరావు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, నారాయణ, తదితర ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఎంప్లాయీస్ రాష్ట్ర జేఏసీ చైర్మన్, టీఎన్వోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ప్రతీ పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నాయకులు రాము, మడిపల్లి కాళీచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాగి శ్రీనివాస్, గంగారపు రమేశ్ పాల్గొన్నారు.

బంగారు నగలు మాయం

కరీంనగర్ క్రైం: బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఓ మహిళ శుక్రవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్ ఆర్టీసీ కాలనీకి చెందిన వేల్పుల మమత శుక్రవారం ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్యాసింజర్ ఆటోలో వచ్చింది. కరీంనగర్ బస్టాండ్‌లో సికింద్రాబాద్ వెళ్లే బస్సు ఎక్కి చూసేసరికి ఆమె బ్యాగులో ఉన్న 60 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3000 నగదు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులకు తన నగలు, డబ్బు దొంగతనం చేశారని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

'గంగుల' విజయదశమి శుభాకాంక్షలు



కమలాకర్

కరీంనగర్: చెడుపై విజయానికి సంకేతంగా.. మంచి గెలుపునకు సూచికగా నిర్వహించుకునే పర్వదినం విజయదశమి అని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలుస్తూ అప్రతిహత విజయాలు నమోదు చేస్తున్న తెలంగాణ రాబోయే కాలంలోనూ మరింత అద్భుతమైన ప్రగతి సాధించాలని ఆ ముగ్గురమ్మల మూలపుటమ్మ విజయదుర్గా దేవిని ప్రార్థిస్తూ అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం

గన్నేరువరం: బేడ బుడగ జంగాల హక్కుల దండు రాష్ట్ర వ్యవస్థాపక ఇన్‌చార్జిగా మండల కేంద్రానికి చెందిన టేకు అనిల్ నియామకమయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు రాజలింగం శుక్రవారం నియామక పత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానాలతో నడుస్తూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి, అంజి, రాజయ్య, చంద్రయ్య, లింగమూర్తి, పోచయ్య పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సిద్ధం

- గిద్దెపెరుమాండ్ల ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

కరీంనగర్‌కల్చరల్: చెడుపై మంచి విజయానికి సూచికగా నిర్వహించుకునే పండుగ విజయదశమి(దసరా). హిందూ సంప్రదాయంలో విశిష్ట రోజుగా చెప్పుకుంటాం. ఈరోజు చేపట్టిన ప్రతీ పనిలో విజయం లభిస్తుందని నమ్మకం. శనివారం దసర పండుగ పురస్కరించుకొని కరీంనగర్‌లోని గిద్దెపెరుమాండ్ల ఆలయం, మహాశక్తి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో శమీ పూజల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గిద్దెపెరుమాండ్ల ఆలయంలో ..

ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు గిద్దెపెరుమాండ్ల ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో క్యూలైన్లు, మంచీనీటి సౌకర్యం, బారికేడ్స్ ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటలకు వాహన పూజలు, 12.15 గంటలకు గణపతి పూజ, 12.35 శమీ పూజ, రాత్రి 8 గంటలకు రామ్‌లీల ఉంటుంది. ఆలయం ముందు భాగం చతుచక్రవాహన పూజలు, ఆలయం ఎడమ వైపు ద్విచక్ర వాహన పూజల నిర్వహించనున్నారు. మహాశక్తి ఆలయంలో రాజరాజేశ్వరి దేవి పూజ, ఉదయం శమీపూజ, ఉదయం 9 గంటలకు నుంచి వాహన పూజలు జరగనున్నాయి.



ముస్తాబైన గిద్దె పెరుమాండ్ల ఆలయం

దుర్గాభవానీ ఆలయంలో..



ఏర్పాటు చేసిన క్యూలైన్లు

విద్యానగర్: కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో దసరా పండుగా సందర్భంగా శనివారం అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో గజ వాహనంతో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో ఉ.8 గంటల నుంచి వాహన పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో శమ్మిపూజ, రావణ సంహారం కార్యక్రమాలు జరుగుతాయి.

రాంలీలాకు ఏర్పాట్లు



చొప్పదండి: పట్టణంలోని క్రీడా మైదానంలో రాంలీలా ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయదశమిని పురస్కరించుకొని ఏటా విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాంలీలా ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవం పురస్కరించుకొని సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తలతో హిందూ సాంప్రదాయాలపై ప్రసంగం, చివరగా చెడుపై మంచి విజయానికి సంకేతంగా బాణాసంచా పేలుస్తుంటారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య రాంలీలా నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. సాయంత్రం జరిగే ఉత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జమ్మికుంట: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని టౌన్ సీఐ వరంగంటి రవి అన్నారు. మున్సిపల్ పరిధి, మోత్కులగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య బిట్ల మోహన్, పొనగంటి విజయలక్ష్మిమల్లయ్య, సారంగం, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఏవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనవసరమైన గొడవలకు తెరలేపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. దసరా సందర్భంగా అందరికీ విజయాలు చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అన్నపూర్ణ అలంకరణలో అమ్మవారు



చండీహోమంలో భాగంగా మహాపూర్ణాహుతి

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే

విద్యానగర్(కరీంనగర్): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో శుక్రవారం మహా నవమి సందర్భంగా అమ్మవారు చేతిలో అక్షయపాత్ర ధరించిన ఆదిభిక్షువుకు అన్నాన్ని ప్రసాదిస్తున్న రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చండీహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించగా నవరాత్రుల్లో చివరి శుక్రవారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. వేదపండితులు సుధాకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.



చెర్లభూత్కూర్‌లో హోమం

వరికి తెగులు.. రైతన్న దిగులు

- సన్నాలకు దోమపోటు
- దిగుబడిపై ప్రభావం





నగునూరులో దోమపోటు సోకిన వరిపంటను పరిశీలిస్తున్న ఏవో సత్యం, వరిమొదళ్లలో ఎండిపోతున్న మొక్క

కరీంనగర్‌రూరల్: భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటకు భారీ వర్షాల అనంతరం వాతావరణం ఉక్కపోతగా మారడంతో సన్నరకం వరిపంటలో దోమ ఉధృతి పెరిగింది. పిల్ల, పెద్ద దోమలు నీటి పైభాగంలో తేలియాడుతూ వరి దుబ్బుల మొదళ్ల దగ్గర రసం పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయి. దోమపోటు నియంత్రణ చర్యలు త్వరగా చేపట్టకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కరీంనగర్ మండలంలో వానాకాలం సీజన్‌లో 12,750 ఎకరాల్లో వరిపంట సాగు చేయగా, 2,198 ఎకరాల్లో సన్నాలను రైతులు సాగు చేశారు.

దోమపోటు సోకే విధానం

పొలాల్లో సుడి దోమలు ఎక్కువగా ఉంటాయి. భారీ వర్షాల తర్వాత వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వరిపంటలో దోమ ఉధృతి ఎక్కువగా పెరిగింది. ఎక్కువ సంఖ్యలో దోమలు పంట మొదళ్ల చుట్టు కనిపిస్తాయి. పొలాల్లో దోమలు నీటిపై తేలుతూ మొదళ్ల చుట్టు తిరుగుతూ రసాన్ని పీల్చుతాయి. వరి ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే నీటిపై నూనె తెట్టెలాగా కనిపిస్తాయి. మొక్క సుడులుగా ఎండిపోతోంది.

చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు

- పొట్ట దశలో దోమ ఉధృతి ఎక్కువైతే పంటకు గింజ రాదు.
- గింజ దశలోకి వచ్చినట్లయితే తాలుగా మారుతోంది.
- నూకశాతం పెరిగి దిగుబడి తగ్గిపోతుంది.
- ఒక్కోసారి పంట చేతికి వచ్చే అవకాశముండదు.
- పొలాల్లో 5నుంచి 10 దోమలు కనిపిస్తే తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా వరిలో పాయలు ఏర్పాటు చేయాలి.
- పాయలతో పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉధృతి తగ్గుతుంది.
- పొలంలో నీటిని పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉధృతి తగ్గిపోతుంది.

అదనపు ఖర్చు పెరిగింది

15 ఎకరాల్లో సన్నాలను సాగు చేశా. వరిపంట పొట్టదశలో దోమపోటు వచ్చింది. దోమపోటు నియంత్రణకు మూడు పర్యాయాలు రసాయన మందు పిచికారీ చేశా. సుమారు రూ.లక్ష వరకు అదనపు పెట్టుబడి ఖర్చు పెరిగింది. దోమపోటుతో దిగుబడి తగ్గిపోయే అవకాశముంది.

– దబ్బెట రమణారెడ్డి, రైతు, చెర్లభూత్కూర్

రసాయన మందు పిచికారీ చేయాలి

వరిపంటలో దోమ కనిపిస్తే పెక్సలాన్ మందును 94 మిల్లీ లీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కలో రోగ నిరోధకశక్తి పెరుగుతోంది.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

వాహన పూజకు ఏర్పాట్లు పూర్తి



గట్టుదుద్దెనపల్లిలోని హనుమాన్ ఆలయం

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద వాహనపూజకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో మారుతి శుక్రవారం తెలిపారు. ఆలయం వాహన పూజకు ఎంతో ప్రసిద్ధి. ఏటా దసరా రోజున వాహన పూజలు జోరుగా సాగుతాయి. అన్నిరకాల వాహనాలను పూజ కోసం ఇక్కడికి తీసుకొస్తారు. పదిహేను మంది పూజారులు సిద్ధంగా ఉంటారని, ఆలయం వద్ద టెంట్లు, భారీకేడ్లు, నీటివసతి కల్పిస్తామన్నారు. భక్తుల రద్దీ కారణంగా సాధారణ పూజలు మాత్రమే ఉంటాయని, ఉదయం నాలుగు గంటల నుంచే పూజలు ప్రారంభమవుతాయని, ఉదయం శమీపూజ కూడా నిర్వహిస్తామని, ఆలయం వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని ఈవో తెలిపారు.